భరత్ భూషణ్ కుటుంబానికి
'డబుల్ బెడ్‌రూం'

- తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసిన చిత్రకారుడి భార్య సుభద్రమ్మ పేరుమీద ఇల్లు
- పేదరికం చూసి చలించిపోయిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్
- సర్కారు సాయం అందించాలని మంత్రి కేటీఆర్‌కు ఆదేశాలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సాంస్కృతిక, సృజనాత్మక రంగాల ద్వారా తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, తమ జీవితకాలం కృషి చేసిన తెలంగాణ కళాకారుల కుటుంబాలను ఆదుకుంటూ మానవీయ పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఆ దిశగా మరో నిర్ణయం తీసుకొన్నది. ప్రఖ్యాత ఫొటో జర్నలిస్టు, చిత్రకారుడు దివంగత భరత్‌భూషణ్ కుటుంబానికి అండగా నిలిచింది. భరత్ భూషణ్ కుటుంబం పేదరికాన్ని చూసి చలించిపోయిన సీఎం కేసీఆర్.. వారికి డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరుచేయాలని మంత్రి కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో హైదరాబాద్‌లోని జియాగూడలో భరత్ భూషణ్ సతీమణి సుభద్రమ్మ పేరుమీద డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయిస్తూ తెలంగాణ సర్కారు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్ద దిక్కును కోల్పోయిన వారి కుటుంబానికి తానున్నానంటూ భరోసానిచ్చింది. గతంలో భరత్ భూషణ్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి ఆరోగ్యనిధి నుంచి ప్రభుత్వం చేయూతనందించిన విషయం తెలిసిందే. కాగా, తమను కష్టకాలంలో ఆదుకొంటూ, తాజాగా డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించి మరోసారి అండగా నిలిచినందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తోపాటు తెలంగాణ సర్కారుకు భరత్ భూషణ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎవరీ భరత్‌భూషణ్?

భరత్ భూషణ్ 1953లో వరంగల్ నగరంలోని గిర్మాజిపేటలో జన్మించారు. ఆయన విలక్షణమైన శైలి కలిగిన ఫొటోగ్రాఫర్. ఫొటోగ్రఫీని పెయింటింగ్‌లాగా భావించేవారు. నాలుగు దశాబ్దాలపాటు వినూత్న శైలితో ఫొటోగ్రఫీలో విశేష సేవలందించారు. తెలంగాణ సంస్కృతి, గ్రామీణ జీవన స్థితిగతులపై అనేక ఫొటో ప్రదర్శనలిచ్చి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు పొందారు. తెలంగాణ సంస్కృతిపై మక్కువతో వందలాది ఫొటోలు తీసి భరత్ భూషణ్ కీర్తి గడించారు. తెలంగాణ సాంస్కృతిక, సామాజిక జీవన చిత్రానికి భరత్ భూషణ్ ఫొటోలు కేరాఫ్ అనడం అతిశయోక్తికాదు. నాలుగు దశాబ్దాల పాటు కలర్ ఫొటోగ్రఫీలో విశేష ప్రశంసలందుకొన్నారు.

బతుకమ్మ భరత్ 'భూషణం'

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే ఫొటోలు అనగానే గుర్తుకు వచ్చే పేరు భరత్ భూషణ్. ఆయన దగ్గర ఎలాంటి సందర్భానికి సంబంధించిన ఫొటో కావాలన్నా లభించేది. బతుకమ్మ, బోనాలు సహా పలు తెలంగాణ పండుగలు, పల్లె వాతావరణం, సాంస్కృతిక జీవన చిత్రాల ఫొటోలకు భరత్‌భూషణ్ ఓ లైబ్రరీగా ఉండేవారు. ప్రజాకవి కాళోజీ సహా ఎంతోమంది కవులు, రచయితల పుస్తకాలపై భరత్ భూషణ్ ఫొటోలు ముఖచిత్రాలుగా ముచ్చటగొలిపాయి. బతుకమ్మ ఫెస్టివల్‌ను డాక్యుమెంట్ చేసి తెలంగాణ సంస్కృతిపై తనకున్న మక్కువను చాటుకొన్నారు.

రాష్ట్ర తొలి ఉత్తమ ఫొటోగ్రాఫర్ భరత్

2015 జూన్ 2న జరిగిన తెలంగాణ రాష్ట్ర మొదటి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భరత్‌భూషణ్‌కు 'ది బెస్ట్ ఫోటో జర్నలిస్టు అవార్డు' ఇచ్చి సత్కరించింది. భరత్ భూషణ్ తన జీవిత కాలంలో ఫొటో ఎగ్జిబిషన్లు, ఆర్ట్ షోలు ప్రదర్శించి ప్రశంసలు అందుకొన్నారు. సహజమైన వెలుగులో లైట్లు లేకుండా ఫొటోలు తీయడం భరత్ భూషణ్ ప్రత్యేకత. ఫొటో జర్నలిస్టుగా అనేక మ్యాగజైన్లకు ఫ్రీలాన్సర్‌గా పనిచేశారు. ఫిల్మ్ మ్యాగజైన్ 'చిత్ర భూమి', 'ఆదివారం' మ్యాగజైన్లలో రెగ్యులర్ ఉద్యోగిగా ఉన్నారు. చిత్రకారుడైన భరత్‌భూషణ్ తెలుగు, ఇంగ్లిష్‌లో పలు వ్యాసాలు కూడా రాశారు. వందలాది బొమ్మలు గీశారు. సినిమా రంగంలోనూ సేవలందించారు. 1980 ప్రాంతంలో వచ్చిన 'మా భూమి' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు.

సూర్యాపేటలో మొదటి అంతస్తు నిర్మాణం పూర్తిచేసుకున్న బ్రాహ్మణ సదన్

బ్రాహ్మణ సదన్‌లో పూర్తయిన హాల్

2.50 కోట్లతో విప్రహిత బ్రాహ్మణ సదన్

నేడు సూర్యాపేటలో ప్రారంభించనున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సాంస్కృతిక, సామాజిక, వైదికపరమైన కార్యక్రమాలతోపాటు బ్రాహ్మణ సమాజ హిత కార్యకలాపాల కోసం సకల సౌకర్యాలతో విప్రహిత బ్రాహ్మణ సదనాల నిర్మాణానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చొరవతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని దురాజ్‌పల్లిలో రూ.2.50 కోట్లతో రెండంతస్తుల్లో బ్రాహ్మణ సదన్ నిర్మాణం చేపట్టారు. కింది అంతస్తు పనులు పూర్తి కాగా.. ఆదివారం దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించనున్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలో రూ.12 కోట్లతో నిర్మించిన రాష్ట్ర స్థాయి విప్రహిత బ్రాహ్మణ సదనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. సిద్దిపేట, చేరాలలో బ్రాహ్మణ సదన్ నిర్మాణానికి రూ.75 లక్షలు, మధిరలో రూ.73 లక్షలు కేటాయించగా పనులు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో బ్రాహ్మణుల సర్వతోముఖాభివృద్ధి కోసం రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి అధ్యక్షతన 18 మంది సభ్యులతో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. పరిషత్ ద్వారా బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.261 కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చించింది. విప్రహిత బ్రాహ్మణ సదన్ నిర్మాణానికి అయ్యే ఖర్చులో గరిష్ఠంగా 75 శాతం బ్రాహ్మణ పరిషత్ భరిస్తున్నది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని దురాజ్‌పల్లిలో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సదన్‌ను సకల సౌకర్యాలతో ప్రభుత్వం నిర్మించింది.

సీఎం కేసీఆర్‌కు అన్నీ శుభాలే కలగాలి

హైదరాబాద్‌లో మొదటి బ్రాహ్మణ సదన్‌ను ప్రారంభించుకొని నేడు సూర్యాపేటలో రెండోది ప్రారంభించుకోవడం బ్రాహ్మణులందరికీ గర్వకారణం. జాతీయ రహదారిపై అందరికీ అందుబాటులో ఉండేలా భూమిని దానం చేసిన డాక్టర్ రామయ్య దంపతులకు, భవనం నిర్మాణం చేయించిన సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డికి అన్నీ శుభాలే కలుగాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నాం.

- నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

37.34 కోట్లతో 130 కొత్త ఆలయాలు

- దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులతో రాష్ట్రంలో కొత్తగా 130 ఆలయాల నిర్మాణం చేపట్టనున్నామని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడించారు. తన అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగిన సీజీఎఫ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్రంలో ఆలయాల పునరుద్ధరణ, వివిధ అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని వివరించారు. రూ.37.34 కోట్లతో కొత్తగా 130 ఆలయాలు నిర్మించాలని నిర్ణయించినట్టు మంత్రి వెల్లడించారు. స్వరాష్ట్రంలో మొత్తంగా 2,378 ఆలయాల నిర్మాణానికి సుమారు రూ.598 కోట్లు మంజూరు చేశామని, ఇప్పటి వరకు రూ.225 కోట్లతో పనులు పూర్తి చేశామని చెప్పారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కమిషనర్ కృష్ణవేణి, చీఫ్ ఇంజినీర్ జీ సీతారాములు, ఎస్‌ఈ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు మూడు రోజుల శిక్షణ

ఆగమశాస్త్ర విధివిధానాల ప్రకారం ఆలయాల్లో పూజలు నిర్వహించే అంశంపై రాష్ట్రంలోని 6,500 మంది ధూప దీప నైవేద్య అర్చకులకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాల్లో శైవ, వీరశైవ, వైష్ణవ, గ్రామ దేవతల ఆలయాల్లో పాటించాల్సిన పూజా విధి విధానాలతోపాటు ప్రవర్తనా నియమావళిపై తగిన శిక్షణ ఇస్తారు. అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆదివారం నుంచి 3వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో నిర్వహించే ఉమ్మడి నల్లగొండ జిల్లా శిక్షణ తరగతులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆగమశాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించడం వల్ల సమాజ శ్రేయస్సు జరుగుతుందని, ఆశించిన ఫలితాలు సమకూరుతాయని తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ధూప దీప నైవేద్య అర్చకులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్ ఇంట్లో 2 కోట్ల నగదు

- అక్రమాస్తుల కేసులో మర్రిగూడ తహసీల్దార్ అరెస్టు
- హైదరాబాద్‌లోని మహేందర్‌రెడ్డి ఇంటిలో ఏసీబీ సోదాలు
- మొత్తం 4.56 కోట్ల ఆస్తులు సీజ్

మర్రిగూడ తహసీల్దార్ మహేందర్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న నల్లగొండ జిల్లా మర్రిగూడ తహసీల్దార్ మహేందర్‌రెడ్డిని శనివారం అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. అంతకుముందు హస్తినాపురంలోని షిర్డీసాయినగర్‌కాలనీలో ఉన్న ఆయన నివాసంతోపాటు వివిధ ప్రాంతాల్లోని ఆయన బంధువులు, స్నేహితుల ఇండ్లపై ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు సంపాదించినట్టు అందిన సమాచారం మేరకు తహసీల్దార్ ఇంటిపై దాడులు జరిపినట్టు అధికారులు తెలిపారు. మహేందర్‌రెడ్డి ఇంట్లో రూ.2 కోట్ల 7లక్షల నగదుతోపాటు రూ.4,56,66,660 విలువ చేసే స్థిర, చర ఆస్తులను సీజ్ చేసినట్టు వెల్లడించారు. అనంతరం మహేందర్‌రెడ్డిని అరెస్టు చేసి, ఏసీబీ మొదటి అదనపు ప్రత్యేక జడ్జి ముందు హాజరుపరిచినట్టు వెల్లడించారు.

కుమార్తె నిత్యతో సురేశ్ నందిని దంపతులు

చిన్నారులకు ఉచితంగా
గుండె శస్త్రచికిత్సలు

- త్వరలో 500 మంది బాలలకు ఆపరేషన్ నిర్వహించనున్న నిమ్స్
- బ్రిటన్ వైద్యులకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప సత్కారం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 30: నిమ్స్ చరిత్రలోనే తొలిసారిగా త్వరలో 500 మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నది. ఇటీవల బ్రిటన్ వైద్యులతో కలిసి నిమ్స్ వైద్యులు 15 మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడంతో ప్రస్తుతం వారు పూర్తిగా కోలుకుంటున్నారు. శనివారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో యూకే వైద్యుల సత్కార కార్యక్రమ ముఖ్య అతిథి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతోపాటు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. రూ.4 లక్షల వరకు ఖర్చయ్యే ఈ శస్త్రచికిత్సలను బ్రిటన్‌కు చెందిన డాక్టర్ రమణారావు పర్యవేక్షణలో ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్న పిల్లందరికీ ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించాలన్న సీఎం కేసీఆర్ సంకల్పం, మంత్రి హరీశ్‌రావు ఆలోచన ఎంతో గొప్పదని బ్రిటన్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణారావు దన్నపునేని కొనియాడారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..

రోగుల తల్లిదండ్రులు సురేశ్, నందిని (ఛత్తీస్‌గఢ్), షేక్ మదీనా (సూర్యాపేట) మాట్లాడుతూ.. తమ పిల్లను కాపాడిన తెలంగాణ ప్రభుత్వానికి, నిమ్స్, బ్రిటన్ వైద్యులకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. వారితో కలిసి సెల్ఫీలు దిగారు. అనంతరం డాక్టర్ రమణారావుతోపాటు వైద్యులు గీత, నాగ్‌కిశోర్ పుప్పాల, ఆండ్రియా ఉడ్స్, ఆదిల్ దినకర్, ఇవార్స్ వెగరీస్, సుబ్రమణియన్ చెలప్పన్, ఇవా జరీనా, జెన్నా ఇంగ్మాన్స్‌లను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, కార్డియో థోరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్ తదితరులు ఘనంగా సత్కరించారు.

బీసీలకు మొండి 'చెయ్యి'

సీనియర్ల టికెట్లకే రేవంత్ ఎసరు

- పొన్నాల సహా పలువురికి టికెట్లు హుళక్కే
- బీసీలను వెళ్లగొట్టి తన వాళ్లకు టికెట్లిచ్చేలా పీసీసీ చీఫ్ స్కెచ్
- ఢిల్లీలో బీసీ నేతల బైఠాయింపు
- 40 సీట్లు ఇవ్వకపోతే తిరుగుబాటేనని హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఆధిపత్యం చెలాయించి ఏ ఎన్నికల్లోనైనా టికెట్టు సాధించుకున్న బీసీ నేతలు, ఇప్పుడు టికెట్టు కోసం ఢిల్లీ చుట్టూ తిరగాల్సిన దుస్థితి వచ్చింది. సీనియర్లు, పార్టీ కోసం సర్వం ధారపోసిన వారిని జాగ్రత్తగా పక్కకు తప్పించి ప్రస్తుత పార్టీ నాయకత్వం తమతోపాటు తెచ్చుకొన్న కొత్తవారిని రంగంలోకి దింపుతున్నది. ప్రజల్లో ఉన్న, పార్టీ కోసం పనిచేసిన హేమాహేమీలాంటి వారిని కాదని డబ్బున్నవారికి పెద్దపీట వేస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల జాబితాలో కొత్త కొత్తవాళ్లు చేరిపోతుండడంతో పాత నేతలు బిత్తరపోతున్నారు. వలస నేతలు వచ్చి తమకే టికెట్లు వస్తాయని ప్రకటిస్తుండటంతో ఖిన్నులవుతున్నారు.

వలస నేతలదే రాజ్యం

రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇప్పుడు వలస నేతల రాజ్యమే నడుస్తున్నదని ఆ పార్టీ పాత తరం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచి నియోజకవర్గాలను పట్టుకొని ఉంటున్న తమను కాదని కొత్తవారికి టికెట్లు ఇస్తామని చెప్పడంలో ఆంతర్యమేంటని నిలదీస్తున్నారు. ఎప్పటి నుంచో నియోజకవర్గంలో పనిచేస్తున్న తమకు సర్వేల్లో మెజార్టీ రాదని చెప్తున్నారని, మరి ఇప్పటికిప్పుడు ఎక్కడి నుంచో వచ్చేవారికి మెజార్టీ ఎలా వస్తున్నదని ప్రశ్నిస్తున్నారు. సర్వేలపై తమకు నమ్మకం లేదని, ఏ ప్రాతిపదికగా సర్వేలు చేస్తున్నారో అర్థం కావడంలేదని చెప్తున్నారు. సీనియర్ బీసీ నేతలు ఉన్నచోటనే ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు సృష్టిస్తున్నారని, ఈ ఎన్నికల్లో వారికి టికెట్లు రాకపోతే ఇక వారికి రాజకీయ జీవితమే ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా రాష్ట్ర కాంగ్రెస్‌లోని బీసీ నేతలు ఏకమవుతున్నారు. కొన్ని రోజులుగా వారు ఢిల్లీలో పార్టీ అధిష్ఠానం చుట్టూ తిరుగుతున్నారు. పార్టీలో సీనియర్లను పక్కకు తప్పించి తనకు ఎదురులేకుండా చేసుకొనేందుకు పీసీసీ ముఖ్యనేత స్కెచ్ వేస్తున్నారని, కొత్తవారిని తీసుకొచ్చి సీనియర్ నేతలను పక్కకు నెట్టివేస్తున్నారని చెప్తున్నారు.

- జనగామలో తెలంగాణ పీసీసీ తొలి అధ్యక్షుడు, మాజీ మంత్రి, బీసీ నేత పొన్నాల లక్ష్మయ్యను రాజకీయంగా దెబ్బతీసే కుట్రను పార్టీలోని కొత్త కాంగ్రెస్ నేతలు మొదలుపెట్టారని తెలిసింది. దీనికి పీసీసీ ముఖ్య నేత అధ్వర్యంలోనే స్కెచ్ వేశారని అంటున్నారు. అక్కడ సర్వే చేయిస్తే పొన్నాల లక్ష్మయ్యకు బలం లేదని తేలినట్టు అధిష్ఠానానికి నివేదికలు పంపించారు. అక్కడ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇప్పుడు ఆయనకు టిక్కెట్టు ఇస్తారని ప్రచారం జరుగుతున్నది. కొమ్మూరిని ముందుపెట్టి పొన్నాల వంటి బీసీ నేతను బలిచేసే ప్రయత్నం జరుగుతున్నదని జనగామలోని కాంగ్రెస్ వర్గాలే చెప్తున్నాయి.
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో కూడా రెండు బీసీ స్థానాలను రెడ్డి సామాజిక వర్గాలకే కేటాయిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఆదిలాబాద్ నుంచి గతంలో బీసీ మహిళ గండ్రాత్ సుజాత పోటీచేశారు. ఈసారి కూడా ఆమెనే టిక్కెట్టు ఆశిస్తున్నారు. అయితే, ఇప్పుడు ఆమె స్థానంలో కంది శ్రీనివాస్‌రెడ్డి అనే ఎన్నారైకి టిక్కెట్టు ఇస్తామని పీసీసీ అధ్యక్షుడు చెప్పినట్టు నియోజకవర్గంలో ప్రచారం జరుగుతున్నది. అలాగే ముథోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఎప్పటినుంచో ఉన్న ఆనంద్‌రావు పటేల్‌ను కాదని ఈసారి కొత్తగా విజయ్‌కుమార్‌రెడ్డి పేరును టిక్కెట్ల పరిశీలన జబితాలో చేర్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడా పనిచేసిన ఆనంద్‌రావు పటేల్‌ను కాదని ఎన్నారై విజయ్‌కుమార్‌రెడ్డి పేరు ఎలా వచ్చిందన్నదానిపై నియోజకవర్గ కార్యకర్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ ఆనంద్‌రావు పటేల్‌కు బలమైన రాజకీయ నేపథ్యం ఉన్నది. ఆయన అన్న నారాయణరావు పటేల్ మాజీ ఎమ్మెల్యే. వారికి ప్రత్యేకంగా వర్గం కూడా ఉన్నది. అలాంటి ఆనంద్‌రావు పటేల్‌ను పక్కనబెట్టి ఇప్పుడు కొత్తగా ఎన్నారై విజయ్ కుమార్‌రెడ్డిని తెరమీదకు తేవడంలో కుట్ర ఉన్నదని ఆరోపిస్తున్నారు.
- మాజీ ఎంపీ మధుయాష్కీ ఎల్బీనగర్ స్థానం ఆశిస్తుండగా, ఆయనకు టిక్కెట్టు దక్కకుండా తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయన స్థానంలో బలమైన రెడ్డి సామాజికవర్గ నేతను దించుతామని చెప్తున్నారు. దీంట్లో భాగంగా ఇటీవల మధుయాష్కీపై గోనె ప్రకాశ్‌రావును ఉసిగొలిపారు. దీని వెనుక వ్యూహం ఉన్నదని, మధుయాష్కీని ఆత్మరక్షణలో పడేసి ఇతర సీట్ల జోలికి రాకుండాచేసే ఎత్తుగడ ఉన్నట్టు చెప్తున్నారు.
- మాజీ విప్, బాల్కొండ నేత ఈరవత్రి అనిల్‌ను బాల్కొండ నుంచి తప్పిస్తున్నట్టు సమాచారం. ఆయన స్థానంలో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఉన్న సునీల్‌రెడ్డిని తెరమీదకు తెస్తున్నారు. అనిల్‌ను ఆయనను నిజామాబాద్ రూరల్‌కు మార్చే యత్నం చేస్తున్నట్టు సమాచారం. దీని వల్ల మహేశ్‌కుమార్ గౌడ్‌కు చెక్ పెట్టే వీలవుతుందని మరో ప్రచారం.
- మల్కాజ్‌గిరిలో నందికంటి శ్రీధర్‌ను కూడా వ్యూహాత్మకంగానే బలి చేస్తున్నట్టు తెలుస్తున్నది.
- నర్సంపేట నుంచి గత ఎన్నికల్లో ఓడిన కత్తి వెంకటస్వామికి కూడా టిక్కెట్టు దక్కే అవకాశం కనిపించడంలేదు. ఆయన స్థానంలో దొంతి మాధవరెడ్డికి టిక్కెట్టు ఇస్తారని ప్రచారం.

నోరు మూసుకొని వెళ్లండి!

- టికెట్లు ఎవరికి ఇవ్వాలో మాకు తెలుసు
- మీరు మాకు చెప్పాల్సిన అవసరం లేదు
- 'బీసీ' టికెట్ల డిమాండ్ బండ్ చేయండి
- మళ్లీ మీడియాకెక్కితే బాగుండదు
- బీసీ నేతలకు కాంగ్రెస్ వార్నింగ్
- ఢిల్లీ వేదికగా ఘోర అవమానం
- అధిష్ఠానం వైఖరితో కంగుతున్న బీసీ నేతలు
- ఎన్నికల్లో సత్తా చాటుతామని హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): హస్తినలో రాష్ట్ర కాంగ్రెస్ బీసీ నేతలకు ఘోర అవమానం జరిగింది. వచ్చే ఎన్నికల్లో బీసీలకు 34 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ వెళ్లిన నేతలను ఆ పార్టీ అధిష్ఠానం తీవ్రంగా హెచ్చరించినట్టు తెలిసింది. 'నోరు మూసుకొని వెళ్లండి. ఇంకోసారి బీసీ టికెట్ల డిమాండ్ చేస్తే బాగుండదు. ఎవరికి ఎన్ని సీట్లు ఇవ్వాలో మాకు తెలుసు. మరోసారి ఈ డిమాండ్‌తో రచ్చకెక్కితే సహించేది లేదు' అంటూ హెచ్చరించినట్టు సమాచారం. ఈ ఎన్నికల్లో అధిక సీట్లు దక్కించుకోవడమే లక్ష్యంగా కొన్ని రోజులుగా కాంగ్రెస్‌లోని బీసీ నేతలు పోరాటం చేస్తున్నారు. అయితే ఇక్కడ వారికి ఆశించిన హామీ దక్కకపోవడంతో అధిష్ఠానం వద్దే తేల్చుకోవాలని నిర్ణయించారు. రెండు రోజుల క్రితం మధుయాష్కీ గౌడ్, పొన్నం ప్రభాకర్, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు ఢిల్లీ వెళ్లి రాహుల్‌గాంధీని, మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు ప్రయత్నించారు. అయితే వారి అపాయింట్‌మెంట్ దొరక్కపోవడంతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిశారు. ఆయన బీసీ నేతలను తీవ్రంగా మందలించినట్టు తెలిసింది. 'బీసీలకు ఎన్నిసీట్లు ఇవ్వాలో అన్నే ఇస్తాం. మీరు డిమాండ్ చేసినన్ని సీట్లు ఇవ్వాలా ఏంటి?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా బీసీలను కించపరిచేలా ఆయన పలు తీవ్ర వ్యాఖ్యలు చేసినట్టు చెప్తున్నారు.

ఇది 'బీసీ'లకు జరిగిన అవమానం

ఢిల్లీలో జరిగిన పరిణామాలతో అవాక్కైన నేతలు తీవ్ర ఆవేదనకు గురైనట్టు తెలిసింది. ఇది తమకు జరిగిన అవమానంగా భావించడం లేదని, బీసీలందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నామని ఆ నేతలు అన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. పార్టీలో బీసీ నేతలకు ఈ పరిస్థితి పస్తుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ పరిణామంతో కాంగ్రెస్‌లో బీసీలకు భవిష్యత్తు లేదని తేలిపోయిందని, ఈ పార్టీని నమ్ముకుంటే నట్టేట మునగడం ఖాయమని వారు అన్నట్టు సమాచారం. ఈ అవమానాన్ని మర్చిపోబోమని, తమ సత్తా ఏంటో వచ్చే ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించినట్టు తెలిసింది. పలు చోట్ల పార్టీకి వ్యతిరేకంగా రెబల్‌గా పోటీ చేసేందుకు కూడా వారు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

ప్యాడీ ఫిల్లింగ్ మెషీన్‌కు పేటెంట్

- హన్మాజీపేట యువకుడి ఘనత

వేములవాడ రూరల్/కలెక్టరేట్ (సిరిసిల్ల) సెప్టెంబర్ 30: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పల్లెటూరి పిల్లాడు అద్భుతాన్ని ఆవిష్కరించాడు. మెదడుకు పదును పెట్టి ప్యాడీ ఫిల్లింగ్ మెషిన్ రూపొందించి పేటెంట్ పొందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటకు చెందిన మర్రిపల్లి లక్ష్మీరాజం-రాజవ్వ దంపతుల కొడుకు అభిషేక్. 2019లో హన్మాజీపేట జడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న సమయంలో ఇన్‌స్పైర్ పోటీల్లో భాగంగా ధాన్యాన్ని సులభంగా సంచుల్లో నింపేందుకు ప్యాడీ ఫిల్లింగ్ యంత్రాన్ని రూపొందించాడు. ముగ్గురు చేసే పనిని ఒక్కరే చేయవచ్చు. అదే ఏడాది సిరిసిల్లలో జరిగిన ఇన్‌స్పైర్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంతోపాటు రాష్ట్రస్థాయి ప్రదర్శనలో అవార్డు దక్కింది. ఢిల్లీ నేషనల్ సైన్స్ ఫెయిర్‌లో మూడో స్థానం లభించింది. ఇటీవల అభిషేక్ తండ్రి లక్ష్మీరాజం పేరిట పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కేంద్రం ఇటీవలే పేటెంట్ మంజూరు చేసింది. శనివారం రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ పేటెంట్ పత్రాలు అందజేశారు.

ప్యాడీ ఫిల్లింగ్ మెషీన్‌తో అభిషేక్

సులభంగా ఓటరు జాబితాలో మీ పేరును పరిశీలించుకోండి
"voters.eci.gov.in" వెబ్‌సైట్‌కి లాగిన్ /డౌన్‌లోడ్ Voter Helpline App (VHA)
ఎ) వివరాలు ఇవ్వండి
తప్పనిసరిగా నింపవలసినవి:
రాష్ట్రాన